## క్లుప్తంగా

### 'డీఈవోపై చర్యలు తీసుకోవాలి'

**కడెం:** డీఈవో రామారావుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడు బేర చిన్నయ్య ఓ ప్రకటనలో డిమాండ చేశారు. ఇటీవల డీఈవో కార్యాలయానికి వెళ్లిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భుక్యా రాజేశ్‌నాయక్‌ను డీఈవో రామారావు, ఉమా మహేశ్వర్‌రెడ్డి కులం పేరిట దూషించి దాడికి యత్నించారని ఆరోపించారు.

### నేడు ఎల్వత్‌లో వర్షవాస్

**తానూరు:** మండలంలోని ఎల్వత్ గ్రామంలో శనివారం భారతీయ బౌద్ధమహాభ ఆధ్వర్యంలో వర్షవాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్ బాబు వాగ్మారే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి బౌద్ధ భిక్షువు దీపరత్న, భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర నాయకులు ప్రభాకర్ గడపాలే హాజరవుతారని పేర్కొన్నారు. దీనికి ఆయా మండలాలకు చెందిన భారతీయ బౌద్ధమహాసభ నాయకులు రావాలని కోరారు.

### సాయన్న జయంతి



నివాళులర్పిస్తున్న సభ్యులు

**కుంటాల:** మండలంలోని కల్లూరు గ్రామంలో శుక్రవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రజా వీరుడు పండుగ సాయన్న జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ప్రశాంత్, శంకర్, వంశీ, రాములు, సాయిలు, గజ్జారాం తదితరులు పాల్గొన్నారు.

### ప్యారమూర్‌కు పాదయాత్ర



కాలినడకన వెళ్తున్న భక్తులు

**కుభీర్:** మహారాష్ట్రలోని పౌన గ్రామ భక్తులు సారంగపూర్ మండలంలోని ప్యారమూర్ దత్తాత్రి మందిరం వరకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం కుభీర్ మండలకేంద్రం చేరింది. వారు 20 ఏళ్లుగా ప్రతి సంవత్సరం రక్షాబంధన్‌కు పాదయాత్ర నిర్వహిస్తారు. రాత్రి కుంటాల మండలం అంబకంటిలో బస చేసి శనివారం ప్యారమూర్ చేరుకుంటారు. పూజలు చేసి తిరిగి స్వగ్రామం వెళ్లనున్నట్లు పౌన గ్రామస్తులు పేర్కొన్నారు.

### రేషన్‌కార్డులు పంపిణీ



మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు

**ఖానాపూర్:** పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధి అర్పుత్ కాలనీలో శుక్రవారం రేషన్ కార్డుల మంజూరు పత్రాలను అధికారులు లబ్ధిదారులకు అందించారు. వార్డు అధికారి పద్మ, బీఎల్‌వో రాజేందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జి షౌకత్‌పాషా, షేక్ యూనుస్, షారూక్‌ఖాన్, అమీర్ తదితరులున్నారు.

### 11నుంచి ఆధార్ శిబిరం

**లక్ష్మణచాంద:** మండలకేంద్రంలోని రైతువేదికలో ఈనెల11,12 తేదీల్లో ఆధార్ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈవో అశోక్‌వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ చిన్నారులు, పాఠశాలల విద్యార్థుల కోసం ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### ప్లాట్లు అప్పగించాలని వినతి



తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న నారాయణ్‌రావు పటేల్

**భైంసాటౌన్:** గ్రామంలో తమకు కేటాయించిన ప్లాట్లను ఏళ్లు గడుస్తున్నా అప్పగించడం లేదని సదరు ప్లాట్లు ఇప్పించాలని కుభీర్ మండలం నిగ్వా గ్రామస్తులు పలువురు కోరారు. శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్‌ను కలిసి విన్నవించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి 2004లో 18 ఎకరాల్లో కేటాయించిన స్థలాలు ఇప్పటికీ అప్పగించలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి సంబంధిత తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. 168 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్ చంద్రే, కుభీర్ మండల నాయకులు బషీర్, బంక బాబు, శ్రీనివాస్ తదితరులున్నారు.

# ఉపాధికి నైపుణ్య శిక్షణ

ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థినులు చదువుతోపాటు పలు రంగాల్లో నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి పొందడం సులువు అవుతుంది. ప్రభుత్వం సైతం విద్యాసంస్థల్లో వృత్తి విద్యాకోర్సులు ప్రారంభించి.. విద్యార్థులను నైపుణ్యాలు కల్గినవారిగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టింది. కుంటాల ఆదర్శ పాఠశాలలో పలు వృత్తివిద్యా కోర్సులు ప్రారంభించగా విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారు.

– కుంటాల



కుంటాల ఆదర్శ పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

- 'ఆదర్శ'లో వృత్తి విద్యాకోర్సులు ప్రారంభం
- శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా చదువుతోపాటు వసతి కల్పిస్తున్నారు. ఇక్కడి విద్యార్థులు త్వరగా ఉపాధి పొందేందుకు నైపుణ్యాలను నేర్పించే వృత్తివిద్యా కోర్సులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 కార్యక్రమంలో భాగంగా కుంటాల ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఆగస్టు నుంచి వృత్తి విద్యాకోర్సులను ప్రారంభించారు. ఖాన్ అకాడమీ–ఫిజిక్స్ వారి సౌజన్యంతో కంప్యూటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. వృత్తి విద్యా కోర్సులు విద్యార్థుల భవితకు భరోసాగా మారనున్నాయి.

**తొమ్మిదో తరగతి నుంచి..**

కుంటాల ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 750 మంది విద్యార్థినులు చదువుతున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు రోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజు 45 నిమిషాలు బ్యూటీ అండ్ వెల్‌నెస్ ద్వారా 226 మంది, కంప్యూటర్ విభాగంలో 256 మంది విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి శిక్షణ ప్రారంభమైంది.

**ఇవీ కోర్సులు..**

ఆదర్శ పాఠశాలలో ఐటీ, ఐటీఈఎస్, బ్యూటీ అండ్ వెల్‌నెస్ కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐటీ,ఐటీఈఎస్ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఇందులో ఆపరేటర్ సిస్టం, ఇంటర్నెట్, ఎంఎస్ లోని వర్డ్,ఎక్సెల్, పవర్ పాయింట్ తదితర వాటిపై తర్ఫీదునిస్తున్నారు. బ్యూటీ అండ్ వెల్ నెస్ ద్వారా విద్యార్థినులకు మెనిక్యూర్, పెడిక్యూర్, ఫేషియల్, సారీ డోప్, మెహిందీ,హెయిర్ స్టైల్ తదితర వాటిపై శిక్షణనిచ్చి ప్రోత్సహిస్తున్నారు.



గ్యాల్వానిక్ ఫేషియల్ శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

**అభిరుచి మేరకు శిక్షణ**



విద్యార్థినుల అభిరుచి మేరకు శిక్షణనిస్తున్నాం. బ్యూటీ అండ్ వెల్‌నెస్‌లో భాగంగా పెళ్లికూతురు ముస్తాబు, పెడిక్యూర్, మెడిక్యూర్ తదితర కోర్సులు అందిస్తున్నాం. ఈ శిక్షణ భవిష్యత్తులో ఉపయోగపడుతుంది.

– శిరీష, ఒకేషనల్ ట్రైనర్

**ఆసక్తిగా నేర్చుకుంటున్నారు**



వృత్తి విద్యా కోర్సులను ఇటీవల ప్రారంభించాం. కంప్యూటర్ హార్డ్ వేర్, నెట్‌వర్కింగ్, డీటీపీ, వెబ్ డిజైనింగ్, ఎంఎస్ ఆఫీస్ తదితర కోర్సులపై శిక్షణనిస్తున్నాం. విద్యార్థినులు సైతం ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

– శ్రావణ్, ఒకేషనల్ ట్రైనర్

**భవితకు బాట**



చదువుతోపాటు విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం వృత్తి విద్యాకోర్సులను ప్రవేశపెట్టింది. శిక్షణతో విద్యార్థులు నైపుణ్యం పెంచుకొని త్వరగా ఉపాధి పొందవచ్చు.

– ఎత్రాజ్ రాజు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, కుంటాల

## ఆదమరిస్తే అంతే..



**నిర్మల్‌రూరల్:** జిల్లాకేంద్రంలోని సిద్దాపూర్ శివారు బ్రిడ్జి(వంతెన) ప్రమాదకరంగా మారింది. నిర్మల్ నుంచి నిర్మల్‌రూరల్ మండలంలోని కౌట్ల, తాంష, ముజ్గి, సోన్ మండలం సిద్దిలకుంట గ్రామాలకు ఈ బ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జి పై రైలింగ్ దిమ్మలు విరిగిపోవడంతో వాహనదారులు నీళ్లలో పడుతున్నారు. వర్షాకాలంలో స్వర్ణ వాగు గేట్లు ఎత్తితే బ్రిడ్జి మునిగి రాకపోకలు నిలిచిపోతాయని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ ప్రదేశంలో కొత్త బ్రిడ్జి కట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

**నిర్మల్‌చైన్‌గేట్:** జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్‌రూరల్, సోన్, మామడ, లక్ష్మణచాంద, సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాలకు చెందిన 153 మంది లబ్ధిదారులకు 37 లక్షల 30 వేల 500 రూపాయల విలువైన చెక్కులను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఎఫ్ఎస్‌సీఎస్ ఫంక్షన్ హాల్ ప్రారంభం..**

జిల్లా కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన ఫంక్షన్ హాల్‌ను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, ఎఫ్ఎస్ సీఎస్ చైర్మన్ ధర్మాజీగారి రాజేందర్, డైరెక్టర్లు, మున్సిపల్ కమిషనర్, పలువురు బీజేపీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

**పరామర్శ**

**లక్ష్మణచాంద:** రాచాపూర్‌కు చెందిన రాకేశ్ దాడి చేయడంతో మండలకేంద్రానికి చెందిన గైనం చిన్నయ్య(55) గాయపడి నిర్మల్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి చిన్నయ్యను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు అడ్వాల రమేశ్, ముత్యంరెడ్డి, దశాగౌడ్ తదితరులు ఉన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచకుంటే చర్యలు



జరిమానా విధిస్తున్న డీఎల్‌పీవో సుదర్శన్



పార్‌పెల్లిలో నిల్వనీటిని పారబోయిస్తున్న శివకృష్ణ

**లోకేశ్వరం:** పరిసరాలను శుభ్రంగా ఉంచకుంటే చర్యలు తీసుకుంటామని భైంసా డీఎల్‌పీవో సుదర్శన్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని లక్కీ వైన్స్ చుట్టుపక్కల చెత్తాచెదారం, ప్లాస్టిక్ కాగితాలు, గ్లాసులు పడేసి అపరిశుభ్రంగా ఉండటంతో వైన్స్ నిర్వాహకులకు రూ.1500 జరిమానా విధించారు. ప్రజలకు ఇబ్బంది కల్గించకుండా వ్యాపారాలు చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు. ఆవరణను పరిశుభ్రంగా ఉంచుతూ తడి, పొడి చెత్తను ఎప్పటికప్పుడు సేకరించాలని పేర్కొన్నారు. కార్యదర్శి రాజేశ్వర్ ఉన్నారు.

**లక్ష్మణచాంద:** మండలంలోని పార్‌పెల్లి ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడేలో భాగంగా గ్రామంలోని పలు వీధులను ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ సందర్శించారు. ఈసందర్భంగా ఇళ్ల వద్ద పాత పాత్రల్లో నీటిని పారబోయించారు. ఈసందర్భంగా పలు సూచనలు చేశారు. హెచ్ఈవో హరికుమార్‌గౌడ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

**ముధోల్:** మండలకేంద్రంలో శుక్రవారం డ్రైడేలో భాగంగా మండల ప్రత్యేకాధికారి సుదర్శన్ నాయక్ ఇంటింటికీ తిరుగుతూ కుండీల్లో నిల్వనీటిని పారబోయించారు. అనంతరం మైనార్టీ వెల్ఫేర్ బాలికల పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలో భోజనం పరిశీలించి సూచనలు చేశారు. ఎంపీడీవో శివకుమార్, పంచాయతీ ఈవో అన్వర్ అలీ తదితరులున్నారు.

## 'నిర్మల్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు'

**నిర్మల్‌టౌన్:** సీఎం రేవంత్‌రెడ్డిపై నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని టీపీసీసీ సభ్యులు సాదా సుదర్శన్, సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హది అన్నారు. శుక్రవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గురువారం మహేశ్వర్ రెడ్డి భైంసాలో సీఎంపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేశారన్నారు. డిసెంబర్ లోపు సీఎం మారబోతున్నాడని మతిభ్రమించి మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తన స్థాయి మరిచి సీఎంను విమర్శిస్తే రోడ్లపై తిరగనివ్వమని హెచ్చరించారు. ఎమ్మెల్యే అయినప్పటికీ నిర్మల్‌కు నెలకోసారి వచ్చి వెళ్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంరెడ్డి, అయ్యన్నగారి పోశెట్టి, వేణుగోపాల్, విద్యాసాగర్‌రెడ్డి, కొట్టె శేఖర్, ఖలీమ్, వాజిద్ అహ్మద్, జిశాన్, మజర్‌ఖాన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## 'ప్రజాస్వామ్యాన్ని అణచివేసే కుట్ర'

**ఖానాపూర్:** బీజేపీ నేతలు ప్రజాస్వామ్యాన్ని అణచివేసేలా కుట్రలు చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. బిహార్ రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున.. ఎన్నికల ఎత్తుగడలో భాగంగా బీజేపీ నాయకులు మైనార్టీలు, ఎస్సీలతో పాటు ఇతర ప్రతిపక్షాలకు చెందిన సుమారు 64 లక్షల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూరి తిరుపతి, శ్రీనివాస్, సుంచుల నారాయణ, రాపల్లి రాజేశ్, బోసు భూమన్న తదితరులున్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

## 'సరస్వతి'కి జలకళ

**లక్ష్మణచాంద:** జిల్లాలోని సరస్వతి కాల్వకు నీటిని విడుదల చేయడంతో శుక్రవారం లక్ష్మణచాంద మండలంలోని రాచాపూర్ వద్ద కాల్వ జలకళ సంతరించుకొంది. దీంతో తమ భూములు సాగులోకి వస్తాయని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిండుగా పారుతున్న సరస్వతి కాలువ

### అనాథ శవానికి అంత్యక్రియలు

**ఖానాపూర్:** దస్తురాబాద్ మండలంలోని కడెం ఎడమ కాలువలో ఈనెల 5న లభ్యమైన గుర్తు తెలియని మృతదేహానికి శుక్రవారం ఖానాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహం సమాచారం తెలుస్తుందని.. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో శుక్రవారం వరకు భద్రపరిచారు. ఎవరూ రాకపోవడంతో స్థానిక మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్ సూచనల మేరకు మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని గోదావరి తీరంలో అంత్యక్రియలు చేశారు.

## వరలక్ష్మి వ్రత పూజలు



జిల్లాకేంద్రంలోని నాయుడువాడలో..



లక్ష్మణచాందలో..



లోకేశ్వరంలో..

శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని మహాలక్ష్మీ, విఠలేశ్వరస్వామి తదితర ఆలయాల్లో కొందరు.. మరికొందరు మహిళలు తమ ఇళ్లల్లో లక్ష్మీదేవి ప్రతిమ ఏర్పాటు చేసుకొని వ్రతం చేసుకున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి నైవేద్యం సమర్పించారు. కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పలు సరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు వ్రతం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



భైంసారూరల్: ఇలేగాం మహాదేవుడి ఆలయంలో కుంకుమార్చనల్లో భక్తులు



కుంటాల మహాలక్ష్మీ ఆలయంలో భక్తుల పూజలు



నిర్మల్‌లోని గాంధీనగర్‌లో..



నిర్మల్‌లోని హరిజనవాడ శివాలయంలో..

## ఇలా వచ్చారు.. అలా వెళ్లారు

- భైంసాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో తూతూమంత్రంగా తనిఖీలు

**భైంసాటౌన్:** పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు శుక్రవారం తూతూమంత్రంగా తనిఖీలు చేపట్టారు. డీఎంహెచ్ఓ రాజేందర్, డీసీహెచ్ఎస్ సురేశ్, ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం అధికారి సౌమ్య పలు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. అయితే ఆయా ఆస్పత్రులకు సంబంధించి అనుమతులు, పడకలు, వైద్యులు, సిబ్బంది, రోగులకు అందిస్తున్న వైద్యసేవల వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించలేదు. ఓ ఆస్పత్రిలో వైద్యుల పేరు, విద్యార్హతలు, ఓపీ చార్జీలు, ఇతర వివరాలు ఏవీ లేవు. నిబంధనల మేరకు ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందికి సూచించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. భైంసాలో గురువారం ఓ మృత శిశువు మురికి కాలువలో కనిపించడం.. అదీ ప్రైవేట్ ఆస్పత్రులున్న ప్రాంతంలో చోటు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. అయినప్పటికీ జిల్లా వైద్యాధికారులు ఈ విషయమై వివరాలు తెలుసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాల్సిన అధికారులు ప్రైవేట్ ఆస్పత్రులను చూసీ చూడనట్లు వెళ్లిపోవడం గమనార్హం.



ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రిజిస్టర్ పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రాజేందర్, డీసీహెచ్ఎస్ సురేశ్

### రేపు పాటల పోటీలు

**నిర్మల్‌టౌన్:** అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి పుట్టిన రోజు పురస్కరించుకొని మెగా పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చిరంజీవి యువత నాయకులు శ్రీరాముల శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకట నలో తెలిపారు. ఈనెల 10న ఆదివారం నిర్మల్‌లోని ప్రభు త్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ని ర్వ హించే పోటీల్లో పాల్గొనేవారు 83176 73698, 93900 22111, 99488 83977నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ఎరువుల కొరత సృష్టించొద్దు

**నిర్మల్:** పంటల సాగుకు సరిపడా ఎరువులు సరఫరా చేస్తున్నామని.. కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఏడీఏ విద్యాసాగర్ డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం నర్సాపూర్(జి) మండలకేంద్రంతోపాటు గొల్లమాడలో ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాల్లోని ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్ ఈపాస్ మిషన్ బ్యాలెన్స్ వివరాలు పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల నిల్వలు, ధరలు రైతులకు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూ చించారు. ఆయన వెంట ఏవో రాంచందర్



గొల్లమాడలో పరిశీలిస్తున్న ఏడీఏ విద్యాసాగర్

### రోడ్లపైకి పశువులు రానీయొద్దు

**ఖానాపూర్:** పట్టణంలోని ప్రధాన రోడ్లతోపాటు బస్టాండ్ పరిసరాల్లోకి పశువులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ భజరంగ్‌దల్ నాయకులు శుక్రవారం తహసీల్దార్ సుజాత, మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్, ఎస్సై రాహుల్ గైక్వాడ్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. రోడ్లపైకి పశువులు రావడంతో ప్రమాదాల బారిన పడుతూ మృతి చెందడంతోపాటు వాహనదారులు సైతం కింద పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలించాలని కోరారు. రాజశేఖర్, సందీప్, భూమేశ్, సాయిప్రణీత్, ప్రతాప్ తదితరులున్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు